క్లుప్తంగా

పోరంకి నుంచి టీటీడీకి కూరగాయలు



పెనమలూరు: తిరుమల తిరుపతి దేవస్థానానికి పది టన్నుల కూరగాయలను పోరంకి నుంచి శనివారం పంపారు. టీటీడీ నిత్య అన్నదాన పథకానికి స్వర్గీయ మండల కుటుంబరావు ఆశీస్సులతో మండల శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాతలు పిడికిటి రవి, సునీత పది టన్నుల కూరగాయలు ఇచ్చారు. ఈ సందర్భంగా పోరంకి వెంకట్రామ్ గ్రాండ్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కూరగాయల లారీని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

నూజివీడు డీఎస్పీ కార్యాలయ నిర్మాణానికి రూ. 5 లక్షల విరాళం



హనుమాన్‌జంక్షన్ రూరల్: నూజివీడు డీఎస్పీ కార్యాలయ నిర్మాణానికి బాపులపాడు మాజీ ఉప సర్పంచి, లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు (బాబు) రూ. 5 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చేతుల మీదుగా నూజివీడు డీఎస్పీ డి.లక్ష్మయ్యకు అందజేసినట్లు శనివారం ఆయన తెలిపారు. డీఎస్పీ కార్యాలయ నిర్మాణానికి విరాళం అందించిన దాత కాకాని వెంకటేశ్వరరావును మంత్రి పార్థసారథి, పోలీసు అధికారులు సత్కరించారు.

నూతన చట్టాలపై విద్యార్థులకు అవగాహన



గన్నవరం రూరల్: బాలలు దేశ సంపద అని ఐసీడీఎస్ సీడీపీవో వెంకటలక్ష్మి అన్నారు. ముస్తాబాద జెడ్పీ హైస్కూల్‌లో శనివారం కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన మూడు భారతీయ న్యాయ సంహిత చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులపై జరుగుతున్న లైంగిక దాడులను నిరోధించాలని అన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా అడ్డుకోవాలన్నారు. లైంగిక వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవాలని, ఇబ్బందులు ఉంటే 1098కి ఫోన్ చేయాలని సూచించారు. విద్యార్థులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండటం ఎంతో ముఖ్యమని సీనియర్ సూపర్‌వైజర్ పద్మావతి పేర్కొన్నారు. మిషన్ శక్తి స్కీమ్ ద్వారా వంద రోజుల పాటు ప్రత్యేక అవగాహన, నమోదు కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సభ్యులు బి.శైలజ తెలిపారు. కౌన్సిలర్ పి.స్వరాజ్యం, సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ జె.నానారావు, సామాజిక కార్యకర్త జి.ప్రేమలత, చైల్డ్ హెల్ప్ లైన్ సభ్యుడు టి.సూరిబాబు పాల్గొన్నారు.

డీపీఎస్‌లో ఘనంగా బ్యాడ్జీల ప్రదానోత్సవం



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శనివారం బ్యాడ్జీల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ అడిషనల్ ఎస్పీ స్నేహిత ముఖ్యఅతిథిగా పాల్గొని పాఠశాలలో ఎన్నికైన హెడ్ బాయ్ నందన్, హెడ్ గర్ల్ నమ్రతా బృంద, హౌస్టల వారీగా ఎన్నికై న విద్యార్థులకు బ్యాడ్జీలను ప్రదానం చేశారు. స్నేహిత మాట్లాడుతూ ఎన్నికైన విద్యార్థులు పాఠశాలలో తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు సైబర్ క్రైమ్‌ల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్‌చంద్, అకడమిక్ డైరెక్టర్ డేవిడ్‌రాజు, ప్రిన్సిపాల్ భువనేశ్వరన్ పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పించిన భక్త బృందాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని మొదటి రోజు శనివారం ఇంద్రకీలాద్రిపై గల శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో పలు భక్త బృందాలు పవిత్ర సారె సమర్పించారు. ఇందులో ఆలయ వైదిక, పరిపాలన ఉద్యోగుల బృందం, తాళ్లాయిపాలెం నుంచి శివస్వామిజీ బృందం, తాడేపల్లిగూడెం నుంచి ఆలపాటి రామారావు బృందం, విజయవాడ నుంచి రామమందిరం(ఏలూరు రోడ్డు) బృందం, జి.వాణి బృందం, కొత్త అమ్మవారి గుడి బృందం, జనని బృందం, దుర్గా భవానీ పారాయణ బృందం, చిట్టినగర్‌లోని నరసింహస్వామి దేవాలయం బృందం, కె.ప్రసాదరావు బృందం, కంకిపాడు నుంచి ఎస్ఎస్ఎఫ్ గీతా మందిరం బృందంతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన బృందాలు కలిసి మొత్తం 1,650 మందికి పైగా కనకదుర్గమ్మకు సారె సమర్పించిన వారిలో ఉన్నారు. ఆయా బృందాల సభ్యులకు ఆలయ ఈఓ కెఎస్ రామారావు, అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం ఏర్పాటు చేశారు.

తీరనున్న విద్యుత్ కష్టాలు

- అందుబాటులోకి రానున్న మారేడుమాక విద్యుత్ సబ్‌స్టేషన్
- రూ. 6.60 కోట్లతో నిర్మాణం
- స్థలం వితరణగా ఇచ్చిన దాతలు
- నేడు ప్రారంభోత్సవం



మారేడుమాకలో నిర్మితమైన విద్యుత్ సబ్‌స్టేషన్

కంకిపాడు: శివారు ప్రాంత ప్రజలకు నిత్యం ఎదురయ్యే విద్యుత్ వెతలకు తెరపడనుంది. లోఓల్టేజీ సమస్య పూర్తిగా పరిష్కారం కానుంది. మెరుగైన విద్యుత్ సేవలు అందనున్నాయి. మారేడుమాక కేంద్రంగా దాతలు వితరణగా ఇచ్చిన స్థలంలో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రానుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మండలానికి ఈశాన్య గ్రామమైన మారేడుమాక గ్రామంలో విద్యుత్ శాఖ నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించేందుకు ప్రతిపాదించింది. గ్రామానికి చెందిన సూరపనేని కుటుంబ సభ్యులు 40 సెంట్లకు పైగా స్థలాన్ని వితరణగా ఇచ్చారు. ఈ స్థలంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇందుకు గానూ రూ. 6.60 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో అధునాతన హంగులతో సబ్‌స్టేషన్, సిబ్బంది విధి నిర్వహణ కేంద్రం, శివారు ప్రాంతాలకు విద్యుత్ లైన్ల అనుసంధాన పనులు హుటాహుటిన పూర్తి చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే సబ్‌స్టేషన్ నిర్మాణం యావత్తూ పూర్తయ్యింది. నిధుల కేటాయింపు, అవసరమైన విద్యుదీకరణ పనులు అన్నీ చేయించారు. చివరికి ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభోత్సవానికి బ్రేక్ పడింది.

కరెంట్ కష్టాలకు సెలవు..

ఈ విద్యుత్ కేంద్రం ద్వారా ఉప్పులూరు గ్రామ పరిధిలోని కొంత భాగం, మంతెన, తెన్నేరు, మారేడుమాక, ఉంగుటూరు పరిధిలోని చికినాల, బొకినాల ప్రాంతాలకు గృహావసర, వ్యవసాయ, పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్‌లకు సమర్థంగా విద్యుత్ పంపిణీ జరగనుంది. ఇప్పటి వరకూ ఈ గ్రామాల్లో లోఓల్టేజీ, అరకొరగా అందిన విద్యుత్ సేవలు ఇకపై పరిష్కారం కానుంది. మారేడుమాక సబ్‌స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరా సమర్థంగా సాగేలా ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు.

నేడు విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం..

నూతనంగా నిర్మించిన సబ్‌స్టేషన్ ఆదివారం ఉదయం 11.30 గంటలకు ప్రారంభం కానుందని, కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొంటారని విద్యుత్ శాఖ ఏఈ టి.అశోక్ కుమార్ తెలిపారు. ప్రారంభోత్సవాన్ని దాతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే యార్లగడ్డ విజయోత్సవ ర్యాలీ



జాతీయ రహదారిపై ఎమ్మెల్యే యార్లగడ్డ ర్యాలీ

రామవరప్పాడు / గన్నవరం: గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శనివారం రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి మీదుగా హనుమాన్‌జంక్షన్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముందుగా రామవరప్పాడు రింగ్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాదంపాడులో యూత్ నాయకుడు సర్నాల బాలాజీ ఆధ్వర్యంలో వెంకట్రావుకు స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. రామవరప్పాడు నుంచి చేపట్టిన విజయోత్సవ ర్యాలీలో పలు గ్రామాల్లోని నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు కొల్లా ఆనంద్‌కుమార్, గూడవల్లి నరసయ్య, కోనేరు పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్

టీడీపీ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శనివారం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీ వల్ల జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ఫలితాలు వెలువడిన నెల రోజుల తర్వాత ఆయన విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు నుంచి హనుమాన్‌జంక్షన్ వరకు ఈ ర్యాలీ చేపట్టారు. రింగ్ వద్ద దేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన తర్వాత ర్యాలీ పూర్తిగా చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారిపై కొనసాగింది. సాయంత్రం వాహనాల రద్దీ అధికంగా ఉన్న సమయంలో ప్రారంభమైన ర్యాలీతో జాతీయ రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సాధారణ ప్రయాణికులతో పాటు విధులు పూర్తి చేసుకుని ఇళ్లకు పయనమైన ఉద్యోగులు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. ర్యాలీ ఎక్కడపడితే అక్కడ రహదారిపై నిలిపివేస్తుండటంతో ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన ప్రజలు నరకం చూశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు పోలీసులు నానాకష్టాలు పడ్డారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో గన్నవరం చేరుకున్న యార్లగడ్డ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం పెద్దఆవుటపల్లి, ఆత్కూరు, తేలప్రోలు మీదుగా హనుమాన్‌జంక్షన్ వరకు ర్యాలీ కొనసాగింది.

సివిల్ రంగంలో సాఫ్ట్‌వేర్‌కు ప్రాధాన్యత



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ శివాజీ బాబు తదితరులు

పెనమలూరు: సివిల్ ఇంజినీర్ రంగంలో సాఫ్ట్‌వేర్‌కు చాలా ప్రాధాన్యత ఏర్పడిందని పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీ బాబు అన్నారు. కాలేజీలో గత వారం రోజులుగా జరిగిన ప్రైమావేరా సాఫ్ట్‌వేర్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొని ప్రసంగించారు. సివిల్ రంగంలో భవనాలు, రోడ్ల నిర్మాణానికి సాఫ్ట్‌వేర్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. సివిల్ విభాగాధిపతి డాక్టర్ వి.జగదీష్ మాట్లాడుతూ ప్రైమావేరా సాఫ్ట్‌వేర్‌తో సివిల్ రంగంలో ఉత్తమ ఫలితాలు కనబడుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన 52 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కోగంటి శ్యామ్‌ప్రకాష్, కే ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు



కౌలు కార్డు అందజేస్తున్న సర్పంచి శ్రీనివాస చౌదరి

పెనమలూరు: కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు అందజేస్తామని వైఎస్సార్ సీపీ నాయకుడు, గ్రామ సర్పంచి గుంటూరు శ్రీనివాస చౌదరి అన్నారు. గ్రామంలో శనివారం పది మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులను ఆయన అందజేసి ప్రసంగించారు. కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు తీసుకోవడం వల్ల అనేక లాభాలు ఉన్నాయన్నారు. ప్రధానంగా ఈ క్రాప్, పంట రుణాలు, పంటల బీమా, రైతు భరోసా తదితర పథకాల అమలు జరుగుతాయని తెలిపారు. భూ యజమానులు, కౌలు రైతులు మాట్లాడుకుని అవగాహనకు రావాలని సూచించారు. గ్రామంలో ఇంకా 150 సీసీఆర్‌సీ కార్డులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో దేవప్రియుడు, కౌలు రైతులు పాల్గొన్నారు.

ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు



గన్నవరంలో కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేస్తున్న వైద్యులు



గొల్లనపల్లిలో పెంపుడు కుక్కలకు వాక్సిన్ చేస్తున్న డాక్టర్ రెడ్డెమ్మ, సిబ్బంది

గన్నవరం: స్థానిక బుద్ధవరం రోడ్డులోని ఎన్టీఆర్ పశువైద్య కళాశాలకు చెందిన క్లినికల్ కాంప్లెక్స్‌లో శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేశారు. తొలుత కార్యక్రమాన్ని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీవీఎస్ కిషోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా కుక్కకాటు వల్ల వచ్చే రేబిస్ వ్యాధి అత్యంత ప్రమాదకరమైనదని అన్నారు. ఈ వ్యాధి బారిన పడకుండా పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా యాంటీ రేబిస్ టీకాలను వేయించాలని సూచించారు. రేబిస్ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యల గురించి పబ్లిక్ హెల్త్ విభాగానికి చెందిన డాక్టర్ బిందు కిరణ్మయి వివరించారు. మొత్తం 158 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేసినట్లు బోధనాస్పత్రి విభాగాధిపతి డాక్టర్ కామినేని సురేష్ తెలిపారు. ప్రొఫెసర్లు డాక్టర్ ఎం. శ్రీనివాస్, డాక్టర్ ఎస్ లక్ష్మీరాణి, డాక్టర్ వీ దేవి ప్రసాద్, డాక్టర్ శ్రీధర్ పలువురు అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా గొల్లనపల్లి పశువైద్య చికిత్సా కేంద్రంలో డాక్టర్ బి.రెడ్డెమ్మ శనివారం పెంపుడు కుక్కలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్‌ను అందజేశారు. ఈ సంర్భంగా పెంపుడు కుక్కలు, జంతువుల యజమానులకు అవగాహన కల్పించారు. వైరస్, బ్యాక్టీరియా, పరాన్న జీవులు జంతువుల నుంచి మానవులకు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ వ్యాప్తి చెందుతాయని ఆమె తెలిపారు. పెంపుడు జంతువులతో ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు లేకుంటే మన ప్రాణాలకు ముప్పు తప్పదని హెచ్చరించారు. ఎల్ఎస్ఏ వై.రామకృష్ణ, హెచ్ఏ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యనమలకుదురు సచివాలయం-3 మార్పు

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ యనమలకుదురులో సచివాలయం-3ను శనివారం మార్చారు. ఇంత కాలం ఈ సచివాలయం తాడిగడప డొంక రోడ్డులో ప్రైవేట్ భవనంలో ఉంది. దీనికి మున్సిపాలిటీ అద్దె చెల్లిస్తుంది. అయితే పాత పంచాయతీ వద్ద గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్మించిన సచివాలయ నూతన భవనం కాళీగా ఉండటంతో సచివాలయం-3 ఆ భవనంలోకి మార్చారు. గ్రామస్తులు ఈ మార్పును గమనించాలని కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

వృద్ధుడికి రూ. 15 వేల పింఛన్ మంజూరు చేయండి

పెనమలూరు: గోసాల గ్రామం సాయిబాబా కాలువ కట్టపై ఉంటున్న పటాన్ సైదా(73) పక్షవాతంతో లేవలేని స్థితిలో మంచంలో ఉన్నాడని అతనికి సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించిన విధంగా నెలకు రూ. 15 వేల పింఛన్ మంజూరు చేయాలని నూర్ బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్. చిన్నా కోరారు. శనివారం ఆయన వివరాలు తెలుపుతూ పటాన్‌సైదా దంపతులు వృద్ధాప్యంలో ఉన్నారన్నారు. సైదాకు వృద్ధాప్య పింఛన్ ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు మరణించాడని అన్నారు. అధికారులు, ప్రభుత్వ పాలకులు స్పందించి పటాన్ సైదాకు రూ. 15 వేల పింఛన్ మంజూరు చేసి పేద వృద్ధ దంపతులను ఆదుకోవాలని కోరారు.

సొసైటీ రుణాలు సకాలంలో చెల్లించాలి

నున్న(వియవాడరూరల్): నున్న కోపరేటివ్ బ్యాంక్ ద్వారా రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో తిరిగి చెల్లించాలని అఫీషియల్ పీఏసీఎస్ ఇన్‌చార్జి వి.కిషోర్ బాబు విజ్ఞప్తి చేశారు. శనివారం నున్న కోపరేటివ్ బ్యాంక్‌కు వచ్చిన ఆయన ఐదు లక్షల రూపాయల రికవరీ జరిగిందన్నారు. అనంతరం సిబ్బందితో రుణాల రికవరీ గురించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాల రుణాలు రూ. 21 లక్షలు, స్వల్ప కాల రుణాలు రూ. 8.31 లక్షలు, బంగారంపై తీసుకున్న రుణాలు రూ. 29 లక్షలు బకాయిలు రావాల్సి ఉందన్నారు. త్వరితగతిన రుణాలను వసూలు చేయాలని సూచించారు. వ్యవసాయ రుణాల రికవరీ 98 శాతం ఉందని తెలిపారు. ఇన్‌చార్జి కిషోర్‌తో పాటు సత్యనారాయణపురం బ్రాంచి చీఫ్ మేనేజర్ బి.కోటయ్య, స్థానిక సీఈఓ రమేష్ ఉన్నారు.

రెండు బైక్‌లు చోరీ.. కేసు నమోదు

పెనమలూరు: మండల పరిధిలో వేరు వేరు ఘటనల్లో రెండు బైక్‌లు చోరీ జరగడంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు సంగీత టవర్స్‌కు చెందిన కొంక స్టీఫెన్ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. అతను రెండు రోజుల క్రితం తన బైక్‌ను ఇంటి ఎదుట పార్క్ చేశాడు. కొద్ది సమయం తర్వాత బయటకు వచ్చి చూడగా గుర్తు తెలియని దొంగలు బైక్ చోరీ చేశారు. అదేవిధంగా పోరంకికి చెందిన నరహరశెట్టి నాగ నవీన్ తన బైక్‌ను ఇంటి ఎదుట పార్క్ చేశాడు. అయితే గుర్తు తెలియని దొంగలు అతని బైక్ చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఆర్టీసీ ఫీడర్ పరిధిలో ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహక ఇంజినీర్ పి.హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక హరిజనవాడ, గ్యాస్ కంపెనీ ఏరియా, ఆర్టీసీ బస్టాండ్, విద్యానగర్, శ్రీనగర్‌కాలనీ, బుద్ధవరం రోడ్డు, గొడపేట, ఎంపీడీఓ కార్యాలయం ఏరియా, మదర్‌థెరిస్సా కాలనీ, సుబ్బారావు నగర్, శ్రీమల్లికార్జున స్కూల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

ఘనంగా చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే

గన్నవరం రూరల్: పాఠశాలలకు విద్యార్థులు వెళ్లేవిధంగా వారిని తీర్చిదిద్దడం, ప్రోత్సహించడం చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో వెంకటలక్ష్మి అంగన్‌వాడీ టీచర్‌లకు సూచించారు. ముస్తాబాదలో వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకుని పాఠశాలలకు వెళుతున్న చిన్నారులకు శనివారం గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. బాలలందరికీ గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేసి వారిలో ఉత్సాహాన్ని నింపారు. చిన్నారుల తల్లిదండ్రులు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ జె.నానారావు, సీనియర్ సూపర్‌వైజర్ నాగ పద్మావతి, టీచర్లు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



తేలప్రోలు కొత్తపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



గన్నవరంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు



నున్నలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఉంగుటూరు: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన బాబు జగ్జీవన్‌రామ్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని బాబు జగ్జీవన్‌రామ్ యూత్ అధ్యక్షుడు విశ్వనాథపల్లి రవికుమార్ అన్నారు. తేలప్రోలు కొత్తపేటలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలను వేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఈపూరి కుమార్, యలమర్తి బాబురావు, కోటేశ్వరరావు, పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు. అలాగే మానికొండ, ఉంగుటూరు, ఆత్కూరు, పెద్ద అవుటపల్లి, ఇందుపల్లి తదితర గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఘనంగా జరుపుకొన్నారు.

గన్నవరం: స్థానిక సుందరయ్య పార్కు వద్ద శనివారం భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ, పలువురు నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మురళీ మాట్లాడుతూ... స్వాతంత్ర్య సమరయోధుడుగా, సంఘ సంస్కర్తగా, ఉప ప్రధానిగా జగ్జీవన్‌రామ్ దేశానికి ఎనలేని సేవలందించారని చెప్పారు. ముఖ్యంగా దళితుల అభ్యున్నతికి ఆయన అందించిన సహకారం చిరస్మరణీయమని అన్నారు. ఆయన స్ఫూర్తితో ఎస్సీ వర్గీకరణ సాధన కోసం అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. సంఘ నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు, కట్టివరపు విజయరావు, వనమా నాగేశ్వరరావు, కలపాల బుల్లియ్య, మీసాల రత్నం, కాటూరి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

నున్న(విజయవాడ రూరల్): మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన శనివారం నున్న గ్రామంలో ఘనంగా జరిగింది. జగ్జీవన్ రామ్ దళితుల అభ్యున్నతి కోసం, రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా అమలు చేయడంలో ఎంతో కృషి చేశారని పలువురు కొనియాడారు. తొలుత జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు తగరం సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి మంద వేణుబాబు, గన్నవరం నియోజకవర్గం కోకన్వీనర్ కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి, గొన్నూరు గ్రామ మాజీ సర్పంచి సీమయ్య, కలపాల అబ్రహం, జూనపూడి కృష్ణ, కాటూరి నాగరాజు, గద్దం సుధాకర్, టీడీపీ నాయకులు యర్కారెడ్డి కోటిరెడ్డి, గంపా శ్రీనివాసరావు, గుంటక సుబ్బారెడ్డి, బొకినాల తిరుపతిరావు, ఉయ్యూరు రాజశేఖర్, పరస చైతన్య, తాడంకి రాజారావు, తగరం కుమార్, కొర్నిపాటి రంగారావు, పారిటిగడ్డ కొండ, తగరం విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల విధింపుపై ప్రత్యేక డ్రైవ్



తాడిగడపలో తనిఖీ చేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో పన్నుల విధింపుపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన శనివారం తాడిగడప గ్రామంలో భవనాలను విస్తృతంగా తనిఖీ చేసి వివరాలు వెల్లడించారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పోరంకి, తాడిగడప, యనమలకుదురు, కానూరు సర్కిళ్లలో నిర్మించిన భవనాలు, వాణిజ్య భవనాలు, గోడౌన్‌లు ఆస్తి పన్నులు విధించాలన్నారు. గతంలో రెసిడెన్షియల్ భవనాలుగా ఉండి వాణిజ్య భవనాలుగా మారిన వాటికి పన్నులు మార్పు చేయాల్సి ఉందని తెలిపారు. ఒకే ప్రాంగణంలో ఉన్న అపార్టుమెంట్లకు వివిధ రకాలుగా పన్నులు వేశారని వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో కుళాయి కనెక్షన్‌లు, అనధికార కనెక్షన్‌లను గుర్తించి పన్నులు వసూళ్లు చేస్తామన్నారు. తమ సిబ్బంది తనిఖీకి వచ్చిన సమయంలో భవన యజమానులు వివరాలు తెలపాలని సూచించారు. ఆస్తి పన్నులు 15 రోజుల్లో వేసి డోర్ నెంబర్లు కూడా ఇస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులు దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలి



ఉషారామాలో డిగ్రీ పట్టాలు అందజేస్తున్న బాలకృష్ణ

ఉంగుటూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని కాకినాడ జేఎన్‌టీయూ డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ డాక్టర్ బాలకృష్ణ సూచించారు. ఉంగుటూరు మండలం తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో రెండవ గ్రాడ్యుయేషన్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సుంకర అనీల్ మాట్లాడుతూ తమ కళాశాలలో అత్యున్నత ప్రమాణాలతో విద్యా బోధన అందిస్తున్నామని తెలిపారు. కళాశాలకు ఏ గ్రేడ్ అటానమస్ హోదా ఉందని గుర్తుచేశారు. మన భవిష్యత్తుకు రూపశిల్పులం మనమేనని, మనం తీసుకునే నిర్ణయాలే జీవిత గమనాన్ని నిర్దేశిస్తాయని చెప్పారు. అనంతరం 442 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.